సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణా కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. మొదట అడిష్మన్ కొరకు రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు.

మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048కు సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్..

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు. కన్వీనర్ వనశ్రీ నేతృత్వంలో కౌన్సిలింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.

అమాత్యులుగా హెచ్‌సీయూ స్టూడెంట్స్

- రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబులకు చోటు
- ఎమ్మెల్యేగా తోట లక్ష్మీకాంతరావు



మల్లు భట్టివిక్రమార్క
డిప్యూటీ సీఎం, రెవెన్యూశాఖ మంత్రి



దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
ఆర్థికశాఖ మంత్రి



తోట లక్ష్మీకాంతరావు
ఎమ్మెల్యే

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర మంత్రులుగా ఎన్నికయ్యారు. వీరికి రాష్ట్ర మంత్రి వర్గంలో కీలక శాఖలు కేటాయించారు. ఒకరు ఉప ముఖ్యమంత్రిగా నియమితులవడం విశేషం. మల్లు భట్టివిక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తోట లక్ష్మీకాంతరావు హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులు.మల్లు భట్టి విక్రమార్క 1986లో ఎంఏ హిస్టరీ పీజీ చేశారు. ఆయన ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా మరోసారి ఎంపికయ్యారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని నూతన మంత్రివర్గంలో భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం హోదాతో పాటు రెవెన్యూ శాఖను కేటాయించారు. కాగా మరో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్‌సీయూ 1992లో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. ఆయన మంథని శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు ఆర్థిక శాఖను కేటాయించారు. మంత్రి వర్గంలో ఇద్దరికి అవకాశం రాగా ఇద్దరికీ కీలక శాఖలు అప్పగించడం విశేషం. ఇదిలావుండగా మరో హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి తోట లక్ష్మీకాంతరావు 1993లో ఎంఏ కమ్యూనికేషన్‌లో పీజీ పూర్తి పూర్తి చేశారు. ఆయన ఎన్ఆర్ఐగా ఉండగా కామారెడ్డి జిల్లా జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాష్ట్ర శాసనసభలో ముగ్గురు పూర్వ విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం, అందులో ఇద్దరికి మంత్రి పదవులు రావడంపై హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్, ప్రొఫెసర్లు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీకి చెందిన పలు సమస్యల పరిష్కార దిశగా మంత్రులు చొరవ తీసుకుంటారని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్లెక్సీలమయం

బంజారాహిల్స్: సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ల కాలనీలతో పాటు ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ కటౌట్లను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వద్ద, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, ఖైరతాబాద్ జంక్షన్లలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మరో వైపు సెంట్రల్ మీడియన్లు, మెట్రోపిల్లర్ల మధ్య ఉన్న పెద్ద ఎత్తున అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఆలయ వార్షికోత్సవం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం నిత్యహోమం, సహస్ర తులసి అర్చన ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సుందరకాండ పారాయణం, హోమం, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ, ఆరగింపు తదితర వేడుకలు కనుల పండువగా జరిగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో విచ్చేసి విశేష పూజలు నిర్వహించారు. 9వ తేదీన ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు.

పెట్‌ఫోక్ రివల్యూషనరీ హోమ్ పెట్ ఆవిష్కరణ

- నగరంలో బైక్‌ల ద్వారా గ్రూమింగ్ సేవలు
- టీహబ్‌లో జెండా ఊపి ప్రారంభించిన సీఈఓ శ్రీనివాసరావు



టీహబ్ ప్రాంగణంలో పెట్‌ఫోక్ సంస్థ గ్రూమింగ్ సేవల ప్రారంభ కార్యక్రమంలో నిర్వాహకులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు చేతుల మీదుగా పెట్‌ఫోక్ రివల్యూషనరీ హోమ్‌పెట్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్ నగరంలో బైక్‌ల ద్వారా గ్రూమింగ్ సేవలను జెండా ఊపి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులకు యజమాని ఇంటి వద్ద గ్రూమింగ్ సేవలను అందించేందుకు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నగరాల్లో బైక్‌లపై వెళ్ళి సేవలను అందించడం కూడా సులువుగా ఉంటుందన్నారు. పెంపుడు జంతువుల సంరక్షణ పరిశ్రమలో మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. అన్ని రకాల సేవలలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ఇలాంటి తరుణంలో అసమాన్యమైన సౌలభ్యం, వృత్తినైపుణ్యం, ఉత్పత్తిని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పెట్‌ఫోక్ సంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మీకాంత్ పుదుచేరి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు

గచ్చిబౌలి: తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వి.జగదీశ్వర్‌గౌడ్ ఎల్‌బీ స్టేడియంలో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బీజేపీ అభ్యర్థి ఎం.రవి కుమార్ యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



ధ్వజస్తంభంకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు : పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలతో పాటు పురాతన దేవాలయాల జీర్ణోద్ధారణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శాంతి నగర్ కాలనీలో నూతనంగా పునర్నిర్మించిన ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు.

బచ్చుగూడెం గ్రామంలో..

పటాన్‌చెరు టౌన్: మండలంలోని బచ్చుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ సుమతి రామచందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ సపానదేవ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకటరెడ్డి, ఆలయ కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గడీల పాలన పోయి ప్రజాపాలన వచ్చింది

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి



అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

పటాన్‌చెరు టౌన్: గడీల పాలన పోయి ప్రజాపాలన వచ్చిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు.గురువారం తెలంగాణ ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో పటాన్‌చెరు పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి టపాసులు పేల్చి, స్వీట్లు పంచి పెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులు పెట్టి నొక్కినప్పటికీ రేవంత్‌రెడ్డి అనేక పోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలబడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి ,మాజీ ఉప సర్పంచ్ రాజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మదాస్ రాజశేఖర్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు ముదిరాజ్, ప్రవీణ్, కుంచాల కిషన్, పాషా, యువ రాజ్ మోరే ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిమ్స్ కొత్త చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి నుంచి సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైనం
- శుభాకాంక్షలు తెలిపిన నిమ్స్ ఉద్యోగ సంఘాలు

లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖానా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయంతో ఆస్పత్రి విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

రేపు రుద్రహోమం

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థాన వార్షిక సత్కార పండితులు శైవాగమ ప్రతిష్టాచార్య కాళ్ళకూరి సూర్యశ్రీ చేతుల మీదుగా పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 6.30 గంటలకు గణపతిపూజ, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, శైవాగమ పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, త్రిశూల పూజ, మహాన్యాస మంత్రపఠనం, అమృతేశ్వరుడికి 21 ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం రుద్రహోమం, పూర్ణాహుతి, పండిత ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు.గురువారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు.కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని దానిని పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

డిజిటల్ ప్రాముఖ్యతను విస్మరించలేం

మనూ వీసీ ఐనుల్ హసన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఐనుల్ హసన్, ప్రొఫెసర్లు

రాయదుర్గం: డిజిటల్ విప్లవం యొక్క ప్రభావాలను, దాని ప్రాముఖ్యతను విస్మరించలేమని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, ఐఈఈఈ టాస్క్‌ఫోర్స్ ఇన్ గామిఫికేషన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ అర్జెంటీనా, ఇంటర్నేషనల్ సోషియోలాజికల్ అసోసియేషన్, ఇండియన్ సోషియాలాజికల్ సొసైటీ సహకారంతో 'డిజిటలైజేషన్, న్యూమీడియా, వీడియో గేమ్ కల్చర్' అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ సానుకూల, ప్రతికూల ప్రభావాలు దాని వినియోగంపై ఆధారపడి ఉంటాయన్నారు. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ మాట్లాడుతూ డిజిటల్ విప్లవంలో ఆర్థిక కోణాలు, పద్ధతులను పరిచయం చేయడమే ఈ సదస్సు ఉద్దేశమన్నారు. అనంతరం ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, డాక్టర్ తాహా సంకలనం చేసిన పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్ విడుదల చేశారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షిక క్రీడోత్సవాలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని కేంద్రీయ విద్యాలయ వార్షిక క్రీడోత్సవాలను గురువారం నిర్వహించారు. విశ్రాంత పీఈటీ వి సంజీవన్, వీఎంసీ సభ్యురాలు లిజిబాబి ప్రారంభించారు. విజేతలకు బహుమతులను అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడలలో రాణించేలా చూడాలన్నారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయిన వారిని వారు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రియరాణి, పీఈటీ విజయభాస్కర్‌రెడ్డి ,వందన హరముక్ ప్రసంగించారు.



ఎమ్మెల్యే గాంధీకి సన్మానం



శేరిలింగంపల్లి: హ్యాట్రిక్ విజయం సాధించిన ఆరికెపూడి గాంధీని లక్ష్మీ విహార్ ఫేజ్‌-1 కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీ తనను మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

స్కూటీ పై నుంచి పడి కార్మికుడు మృతి

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం పారిశ్రామివాడలో రోడ్డుపై గుంతలు తప్పించబోయి స్కూటీపై నుంచి కిందపడిన కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం... అల్లాదుర్గంకు చెందిన కుమ్మరి నాగేష్ కంది మండలం ఇంద్రకరణ్‌కి వచ్చి పాశమైలారం పారిశ్రామికవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో బుధవారం కుమ్మరి నాగేష్ డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో భార్య వినోద ఫోన్ చేయగా వస్తున్నా అని తెలిపాడు.ఈ క్రమంలో రాత్రి 10 గంటల సమయంలో పాశమైలారం పారిశ్రామికవాడ నుంచి స్కూటీ పై వస్తున్న కుమ్మరి నాగేష్ రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి అదుపు తప్పి కిందపడిన ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడి భార్య వినోద గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తండ్రి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.హెడ్ కానిస్టేబుల్ నరేష్ కథనం ప్రకారం... భానూర్ బీడీఎల్‌కు చెందిన ముత్తంగి కృష్ణ(49) బుధవారం ఉదయం చిట్కుల్ గ్రామంలో ఉండే సోదరి సావిత్రి వద్దకు వెళ్లాడు.తిరిగి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి బయలుదేరుతున్నాను అని చెప్పాడు. అయితే రాత్రి అయినా కృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా,తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.దీంతో తండ్రి అదృశ్యంపై కుమారుడు భార్గవ్ సాయి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నైట్ డ్యూటీకి వెళ్లి తిరిగిరాలేదు..

పటాన్‌చెరు టౌన్: నైట్ డ్యూటీకి వెళ్ళిన భర్త తిరిగి రాలేదని భార్య పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఏఎస్ఐ ఆముదయ్య కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ పద్మారావు నగర్ కాలనీకి చెందిన మాణిక్యాలరావు(39) బుధవారం నైట్ డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. గురువారం ఉదయం భార్య ఫోన్ చేసి కిరాణా సామగ్రి తెమ్మనగా ఇంటికి చెప్పగా వస్తున్నానని తెలిపాడు. గంటలు గడిచినా భర్త రాకపోవడంతో భార్య గురుదేవి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో భర్త కోసం స్థానికంగా,తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో భర్త అదృశ్యంపై భార్య గురువారం ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో యువకుడు..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం... శ్రీకాకుళం పరిధిలోని ఒప్పంగి గ్రామానికి చెందిన నారాయణరావు(22) అనే యువకుడు బతుకుతెరువు కోసం ముత్తంగి తేజా కాలనీకి వచ్చి పాశమైలారంలో ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గత నెల రోజులుగా నారాయణరావు ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని శాంతినగర్‌లో ఉండే బంధువు కృష్ణకు తమ కుమారుని గురించి తెలుసుకోమని చెప్పడంతో కృష్ణ పరిశ్రమలో వాకబు చేయగా నెల రోజుల నుండి రావడం లేదని చెప్పారు.దీంతో నారాయణరావు కోసం స్థానికంగా, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో వీరి బంధువు కృష్ణ గురువారం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి 7.45 గంటలకు గౌలిదొడ్డి కైరోస్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని డయల్ 100కు కాల్ వచ్చిందన్నారు. గాయపడ్డ వ్యక్తి(45)ని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా ఆల్విన్‌కాలనీకి చెందిన వి.ఫణికుమార్(43) అనే వ్యక్తి రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను అజాగ్రత్తగా నడుపుతూ వ్యక్తిని ఢీకొట్టినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 9490617127, 04027853432 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కాలర్‌షిప్‌లను ప్రకటించిన 'ఐఎస్‌బీ'



గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ ప్రధాన భవనం

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) సాయుధ దళాల స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది. మాజీ సైనికుల సంక్షేమ శాఖ, రక్షణ మంత్రిత్వశాఖ ఇందుకు తన సహకారాన్ని అందిస్తుంది. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, భారత ప్రభుత్వ మాజీ సైనికుల సంక్షేమ శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్‌సింగ్ కలిసి ప్రకటించారు. ఈ ప్రకటనతో ఐఎస్‌బీ సాయుధ దళాల అనుభవజ్ఞులకు లేదా పౌర జీవితంలోకి మారే సిబ్బందికి 50 శాతం ట్యూషన్ ఫీజు మినహాయింపును అందిస్తుంది. పోస్టు గ్రాడ్యుయేట్, అధునాతన మేనేజ్‌మెంట్ కోర్సుకు ఇది వర్తిస్తుంది. ప్రతి యేటా 22 మందికి ప్రయోజనం చేకూరుస్తుంది.

సమాచారం

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల ప్రజల సమస్యల సత్వర కోసం రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్ల వారిగా వార్డు కార్యాలయాలను ప్రారంభించింది సమస్యల పరిష్కారం కోసం నేరుగా వార్డు కార్యాలయంకు వచ్చి ఫిర్యాదులు అందించవచ్చు. వార్డు కార్యాలయాలలో అందుబాటులో జీహెచ్‌ఎంసీ అధికారులు వీరే..

హఫీజ్‌పేట్ డివిజన్ వార్డు కార్యాలయం
హనుమాన్ టెంపుల్, హఫీజ్‌పేట్

హోదా	అధికారి పేరు	ఫోన్ నంబర్
ఏఎంసీ	సి.నాగరాజు	9989930299
ఇంజనీరింగ్	ఎస్.ప్రతాప్	7331189194
శానిటేషన్	సురేష్	9703933383
టౌన్‌ప్లానింగ్	కె.మధుకర్ రెడ్డి	9652783554
యూబీడీ	అనిత	6305430526
యూసీడీ	డి.రుక్మిణి,సీసీ	9849485481
ఎంటమాలజీ	రాజేష్ బాబు	9000231779
ఎలక్ట్రికల్	పి.రామ్మోహన్‌రావు	6309029543
	ఖలీల్	9848011810
వెటర్నరీ	డాక్టర్ అబ్దుల్ బాసిత్	8121041420
కంప్యూటర్ ఆపరేటర్	ఎన్.సౌజన్య	8500100015
టీఎస్‌పీడీసీఎల్	రాజేందర్, ఏఈ	9440813167
వాటర్‌వర్క్స్	యాదగిరి, మేనేజర్	9912904280
హెల్త్	డాక్టర్ శ్రీలేఖ	9640990444
	సునీత (హెచ్‌ఎస్)	9966850918

చందానగర్ డివిజన్ వార్డు కార్యాలయం
గౌతమీనగర్ కమ్యూనిటీ హాల్, చందానగర్

హోదా	అధికారి పేరు	ఫోన్ నెంబర్
ఏఎంసీ	ఎం.గిరి	9000230023
ఇంజనీరింగ్	జి.సంతోష్ కుమార్	9246575931
శానిటేషన్	బి.రవికుమార్	9550347686
యూబీడీ	బి.రాజేశ్వరి	9000983948
యూసీడీ	వీఎఎస్ లక్ష్మి,వీఆర్‌పి	9247824832
ఎంటమాలజీ	ఈ.శ్రీనివాస్	9059446926
ఎలక్ట్రికల్	పి.రామ్మోహన్‌రావు	6309029543
	కె.రాము	9160167388
వెటర్నరీ	డాక్టర్ అబ్దుల్ బాసిత్	8121041420
కంప్యూటర్ ఆపరేటర్	విజయలక్ష్మి	9347580517
టీఎస్‌పీడీసీఎల్	రాజ్‌కుమార్, ఏఈ	9440813169
వాటర్‌వర్క్స్	సునీత, మేనేజర్	9182911255
	కిష్టప్ప	9640748419
హెల్త్	డాక్టర్ కీర్తి	9182911255
	సీహెచ్.స్వామి (సీహెచ్ఓ)	8790223322
	మరియా (ఆశ)	6300461012

87 పనులు.. రూ. 5 కోట్లు!

- త్వరలో ప్రారంభం కానున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు
- రంగంలోకి దిగిన జలమండలి అధికారులు



ఎన్నికల కోడ్‌కు ముందు అంబేద్కర్‌నగర్‌లో ప్రారంభించిన డ్రైయినేజీ పైప్‌లైన్ పనులు

బంజారాహిల్స్: ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో ఆగిపోయిన అభివృద్ధి పనులపై జలమండలి అధికారులు దృష్టిసారించారు. కోడ్ కూతకు ముందు ప్రారంభమైన పైప్‌లైన్ పనులు కోడ్ అమల్లోకి రావడంతో ఆగిపోయాయి. అక్టోబర్ 9వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఆ రోజు నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంచుకోవాల్సి వచ్చింది. ఆగిపోయిన పనులు ప్రారంభించే దిశలో రెండు రోజుల నుంచి జలమండలి అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు.

☛ ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, ఫిలింనగర్, తట్టికాన, జూబ్లీహిల్స్, ఎల్లారెడ్డిగూడ, ఎర్రగడ్డ, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, సోమాజిగూడ, ఎస్ఆర్‌నగర్, ఫతేనగర్ తదితర సెక్షన్ల పరిధిలో 87 పనులు చేపట్టారు. వీటన్నింటికీ కలిపి రూ. 5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కోడ్ అమల్లోకి రాక ముందే ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ఈ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన చేసిన రెండు రోజులకే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఈ పనులు మూలనపడ్డాయి. ఇన్నాళ్లకు పనులకు మోక్షం లభించింది. ముఖ్యంగా కలుషిత మంచినీటి సరఫరా, డ్రైయినేజీ ఓవర్‌ఫ్లో, కొత్త మంచినీటి పైప్‌లైన్లు తదితర పనులు శంకుస్థాపన చేసిన వాటిలో ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఉదయ్‌నగర్ బస్తీలో రూ. 30 లక్షల వ్యయంతో కొత్త మంచినీటి పైప్‌లైన్ వ్యవస్థను నిర్మించేందుకు శంకుస్థాపన జరిగింది. రెండు నెలల తర్వాత ఈ పనులకు మోక్షం లభిస్తున్నది. ఇలాంటి పనులే రెండు నియోజక వర్గాల్లో చోటు చేసుకున్నాయి.

జీహెచ్‌ఎంసీ రోడ్ కటింగ్ బ్యాన్ ఎత్తివేత...

ఒక వైపు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి జలమండలి చేపట్టాల్సిన పనులు ఆగిపోయాయి. ఇదే సమయంలో జీహెచ్‌ఎంసీ రోడ్ కటింగ్ అనుమతులను కూడా నిలిపివేసింది. ఫలితంగా జలమండలి చేపట్టిన అభివృద్ధి పనులు ఈ రెండు కారణాలతో 87 చోట్ల ఆగిపోయాయి. అక్టోబర్ 31తో జీహెచ్‌ఎంసీ రోడ్ కటింగ్ బ్యాన్‌ను ఎత్తివేసింది. మరోవైపు ఎన్నికల కోడ్ కూడా ముగిసింది. ఇక రోడ్ కటింగ్ చేసుకుంటూ పనులు త్వరితగతిన చేపట్టాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరో రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభించి మూడు నాలుగు వారాల్లో పూర్తి చేయాలని తలపెట్టారు.